కథానిక

# హక్కుదార్లు

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

"రిష్టు వాచికూడా కొనుక్కోలేని చవటకు మనమ్మాయినిచ్చి పెళ్ళి చెయ్యటమా..." హఠాత్తుగా కుర్చీలో కూలబడి రేడియో స్విచ్ తిప్పాడు రవివర్మ.

'అల్లుడు రిస్టువాచి అడగటంకూడా తప్పేనా!'

"అల్లుడేమిటి పెళ్ళికాందే."

"పెళ్ళి అయితే అల్లుడేగా..."

"అందువలన ముందర్నుంచే అల్లుడంటూ ప్రచారమేమిటి?"

"అది కాదండీ" వసంతమ్మ చెప్పబోయే మాటకు కూడా సావకాశం యివ్వలేదు.

"ఏది కాదో నాకు తెలీక్కర్లేదు. ఏది అవునో నాకు తెలుసు సరిపోయిందా" రేడియో వాల్యూమ్ పెద్దది చేశాడు వర్మ.

"వితండవాదం మొదలు పెడితే ఎవరు సమాధానం చెపుతారు. మీమాట మీకేగాని యింకోళ్ల మాట వినరే వినలేను "ఇంకేవేవో అనుకుంటూ వసంతమ్మ మెదలకండా వెళ్ళిపోయింది లోపలికి.

వర్మ పుస్తకంలో కాగితాలన్నీ తిరగేయటం అయిపోయింది. ఇంకో పుస్తకం తియ్యబోతూ చటుక్కున రేడియో ఆపేసి గబగబ యింట్లోకి వెళ్ళాడు.

"అయితే ఆస్తి యేమాత్రం వుందేమిటి..."వర్మ కళ్ళజోడులోంచి వసంతవైపునకు చూశాడు.

వసంత ముభావంగా విని వూరుకుంది.

"ఏదో చదువుకున్నాడు. కొద్దో గొప్పో ఆస్తి వుండక పోతుందా అని అనుకున్నాను. వున్నదేమిటో ముందరే ఖచ్చితంగా చెప్పేశెయ్యరాదూ."

"వాళ్ళకు లక్షలు లక్షలు మూలుగుతున్నాయని మీరు అనుకుంటారని వాళ్ళేమి కలలు కనలా" గుక్క త్రిప్పుకోకుండా అనేసింది వసంత.

"దమ్మిడీ ఆస్తిలేని, వెధవ అని నేను వూహించుకుంటానని వాళ్ళకు తెలుసుగాబోలు..."

"ఏమిటామాటలు, పిల్లను యివ్వటం యిష్టం లేకపోగా యీ దూషణకూడా యేమిటి. వాళ్ళేమన్నా మనల్ని వల్లెత్తు మాటన్నారా."

"వాళ్ళను యేమన్నామని వాళ్ళు అనటానికి మనల్ని."

"ఇప్పుడు అన్నది చాలదేమిటి?"

"ఏమన్నా లేకపోయినా రోషానికేమి లోటు లేదు" వర్మ, మళ్ళీ డ్రాయింగు రూములోకి వచ్చేసి సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు.

"సుజీ...ఇటురా...నేను ఓ ప్రశ్న వేస్తాను. సూటిగా సమాధానం చెప్పేస్తావా..."

"ఏమిటండి అట్లా అడుగుతున్నావు."

"నేను అడిగిన దానికి సమాధానం చెప్పు."

"నువ్వేం అడగందే..."

"మరి సూటిగా సమాధానం చెప్పాలి."

"అట్లాగే ప్రయత్నం చేస్తాను."

"హాయిగా సోఫాలో కూర్చుని యిష్టంవచ్చిన పనులు యిష్టం వచ్చినట్లు చేస్తూ, ఇతరుల అధికారాలమీద యితరుల సానుభూతిమీద ఆధారపడకండా జీవితం గడపటం బాగుంటుందంటావా, లేక ఎప్పటికప్పుడు అన్నింటికీ వెతుక్కుంటూ, యావజ్జీవం కష్టపడుతూ చివరికంతో బాధపడటం బాగుంటుందంటావా చెప్పేసెయ్యి. సూటిగా పెద్ద ఆలోచనేమి అక్కర్లా" దీనికి వర్మ చిరునవ్వుతో సుజాత మొహంలోకి చూశాడు.

"ఏమిటా ప్రశ్న. ఎందుకు అడుగుతున్నావో నాకు తెలీట్లా ఏదైనా ప్రాబ్లెంసాల్వ్ చెయ్యాలా యేమిటి?"

"చెబుతాను...సూటిగా సమాధానం చెప్పేశెయ్యి మిగతా విషయాలన్నీ తర్వాత..."

తొందరగా..."వర్మ ఆదుర్దాగా సుజాత మొహం లోకి చూస్తున్నాడు.

"కష్టాలు అనుభవిస్తూ, బీదరికంతో బాధపడటం బాగుంటుంది నాన్న...సుజాత పకపక నవ్వేసింది.

"ఆ...నీ వుద్దేశం నేను కనిపెట్టేశా..."

"నువ్వు అనుకున్న సమాధానానికి వ్యతిరేకంగా చెప్పా కాదు..."

"నీవుద్దేశానికికూడా వ్యతిరేకమే అనుకుంటూ"

"ఇంకా నీకు సందేహమేనా!"

"అట్లారా...దార్లోకి నాకు తెలుసు నీ సమాధానమేమిటో..."

"ప్రశ్నలాంటిది. అవుకుకాని. ఎందుకు అడిగావో చెప్పవా..."

"ఈపాటికి నీకు తెలిసేవుంటుంది అనుకుంటున్నా..."

"అవున్లే"-చివాలున లేచి వెళ్ళిపోయింది సుజాత.

వర్మ నోటుబుక్కులో యేదో రాసేసుకున్నాడు, కాసేపు తీవ్రంగా ఆలోచిస్తూన్నాడు. కప్పు కాఫీ ఖాళీచేసి, రెండు ప్రక్క జేబుల్లోకి రెండు కవర్లు పోనిచ్చేసి, చెప్పులు మూలకు గిరాటు పెట్టి గబగబ లోపలికి వెళ్ళాడు వర్మ.

"ఆ...విన్నావా సుజకి ఆ సంబంధ ఏమాత్రం యిష్టంలేదట నాతో చెప్పేసింది."

"అది చెప్పకమునుపే మీకు తెలుగా." వసంత వెతుక్కోకుండా అనేసింది.

"నీకు మాత్రం తెలీదేమిటి" తేలికగా నవ్వేశాడు వర్మ.

"మీకు అన్ని విషయాలు నవ్వుగానే వుంటాయి ఎవరు యేమి అనుకుంటున్నారో అనేమాటకూడా లేదు..."

"అందరి దగ్గరికివెళ్ళి యేమేమి అనుకుంటున్నారో అడిగిరమ్మంటావా"పకపకనవ్వాడు వర్మ.

"మోహన అంటుంటేనా మనకు అంటినట్టు లేదు. ఇంకా యే మొహంతో అందరి దగ్గరకు వెళ్ళి అడుగుతారు."

"ఏడ్చేవాళ్ళు ఏడుస్తూనే వుంటారు. నవ్వే వాళ్ళు నవ్వుతూనే వుంటారు" వర్మ విదిలింపుగా మళ్ళీ డ్రాయింగు రూములోకి వెళ్ళిపోయాడు.

వసంతకూడా అక్కడినుంచి చిరాకుగా వెళ్ళి పోయింది.

వర్మ అటుయిటుపచార్లు చేస్తున్నాడు. ఒకటి రెండుసార్లు సుజాతను పిలుద్దామని అటువైపు వెళ్ళాడు. ఎందుచేతనో మనస్కరించలేదు. మధు అప్పుడే యింట్లోకి వచ్చాడు. సుజాతా, మధు చకచక ఏవేవో మాట్లాడేసుకుంటున్నారు. సుజాత హఠాత్తుగా బుజాన కోటు తగిలించుకుని వాకిట్లోకి వెళ్ళిపోయింది.

"ఏమోయ్ ఎక్కడనుంచి వస్తున్నావు" వర్మ విసుగ్గా అన్నాడు మధువైపు చూస్తూ.

మధు సమాధానానికి ప్రయత్నం చెయ్యలేదు. పుస్తకాల బీరువాలోపుస్తకాలు సద్దుకుంటున్నాడు.

"ఏదో వకటి చెప్పే సెయ్యాలంటావా. వాళ్ళేమొ నా పీకమీద కూర్చున్నారు." వర్మ మళ్ళీ సంభాషణల్లోకి దింపాడు.

"అమ్మాయి మనసు తెలుసుకున్న వారు అబ్బాయి మనసు తెలుసుకోలేక పోయారా..." వసంత తలుపుచాటు నుంచి స్పష్టంగానే అనేసింది

"నీ మనస్సువుతే నాకు తెలిసిపోయింది."

"ఏమిటి గొడవ" మధుకూడా సంభాషణల్లోకి వచ్చాడు.

"ఏముంది తెల్లారి లేస్తే, వచ్చే సంబంధం పోయేసంబంధం, పోనీ ప్రస్తుతం నేను పెళ్ళి చేసుకో దలుచుకోలేదని వాకిట్లో ఓ బోర్డన్నా వ్రేలాడదీయకపోయినావు. చదువుకున్నవాళ్ళన్నా మన గడప తొక్కకండన్నా వుంటారు." వసంత, మధువైపు తిరిగి అన్నది.

"ఇదేం శపథంకాదు. అన్నీ కలిసివస్తే, పెళ్ళి కేమీ అభ్యంతరంలేదు" మధు ఖచ్చితంగా అనేశాడు.

"మంచి సమాధానం చెప్పావు." వర్మ సంతోషించాడు.

"ఇంతవరకు ఏంకలిసిరాదని వచ్చేవాటిన్నింటిని వెనక్కు పంపించేశావు. అయిదువేలు కట్నం యిస్తానని వచ్చిన ఆ పెద్దమనిషి సంబంధానికి ఏం వంకరవుందని" వసంత మళ్ళీ మొదటికివచ్చింది.

"కట్నం అయిదువేలు బాగానే వున్నాయి మిగతావిషయాలు" మధు చెప్పబోయి ఆగాడు.

"కట్నం ప్రధాన మేమిటి. కాలానికి తగ్గట్టు మంచి చదువుకున్నదాన్ని, తెలివిగలదాన్ని ఏరి తెచ్చుకోవాలి." వర్మ, అభిప్రాయాన్ని ఇచ్చాడు.

"మనకు ఒకటి ప్రధానం వుంది కనక కట్నం ప్రధానం అవుతుందా" వసంత వెంటనే అందుకుంది.

"నా పెళ్ళికి మీ పోట్లాటేమిటి. నాకు నచ్చినదాన్ని నా యిష్టంవచ్చినప్పుడు పెళ్ళి చేసుకుంటా అంతే." మధు నిర్ణయాన్ని చెప్పేసుకున్నాడు.

"నీకు నచ్చిందెవరో తెలుస్తూనేవుంది. వాళ్ళ నాన్న ఒక్క చిల్లిగవ్వ అయినా కట్నం ఇస్తాడనుకున్నావా. ఏ పనైనా చేసేటప్పుడు అన్నీ ఆలోచించుకుని నిర్ణయానికి రావాలి" వసంత గట్టిగా అనేసింది.

"వాడేం పాపాయికాదు. వాడికీ అన్నీ తెలుసు అయిదువేలు కుమ్మరిస్తారు గదా అని గభాలున దూకేస్తాడనుకుంటున్నావేమో" వర్మ కూడా అందుకున్నాడు.

"దూకటానికి ఏ గొయ్యి వుందని, నిక్షేపంగా పెద్దకట్నం యిచ్చి పిల్లనిస్తానంటే చేసుకోటానికేమో..." వసంత ప్రశ్నార్థకంగా మధువైపు చూసింది.

మధు యీ విషయాలేమీ పట్టించుకోనట్లు తన పనుల్లో నిమగ్నుడై పోయాడు.

వర్మకు మాత్రం చదువుకున్న కోడలు రావాలని గట్టి పట్టుదల. వసంతకు ఆడవాళ్ళ చదువుల్లో అట్టే నమ్మకంలేదు. కొడుక్కు కట్నం పెద్దగా రావాలని వసంత తాపత్రయం. వర్మకు కట్నాలమీద అట్టే మోజులేదు. కూతురి పెళ్ళి బుద్ధిమంతునితో అవాలని వసంత ఆదుర్దా. బుద్ధి, డబ్బు, రెండూ ఒక్కచోట వుండవని వసంతకు గట్టినమ్మకం. వర్మకు అల్లుడు పెద్ద ఆస్తిపరుడుగా వుండాలని ఒక నిశ్చయం. మిగతా విషయాలన్నీ తర్వాతే. వీళ్ళిద్దరి పెళ్ళిళ్ళ విషయాల్లో ఎప్పటికప్పుడు సతమతమయిపోవటమే. ఒకళ్ళ భావాలు ఒకళ్ళకు కలవవు. అయితే అన్నా చెల్లెలుమాత్రం యీ విషయాల్ని పట్టించుకోనట్లు ప్రవర్తిస్తూ వుంటారు. కాని యిద్దరికీ చదువుకున్నవాళ్ళమీద మాత్రం మోజు వున్నమాట వాస్తవమే. చదువు ముఖ్యం. తర్వాత విషయాలు రెండోరకమే.

నలుగురు నట్టింట ఒక్కక్షణంకూడా కనిపించరు. ఎవరిపనిమీద వాళ్లు వెళుతూ వుంటారు. అంత స్వేచ్ఛ యే ఆడదికూడా అనుభవించివుండదు. వర్మ భయంవలన వసంత వూరుకుంటోంది కాని లేకపోతే సుజాత వుండాలసిన రీతులు అదివరకే నిర్ణయించి పెట్టేసింది. కొడుకును ఏమనటానికి ఆస్కారం మొదటినుంచీ లేదు... ఆ నాడు శలవు. తీరిగ్గా నవల చదువుకుంటోంది. మధు కాలక్షేపానికి యేవో బొమ్మలు గీస్తున్నాడు. వర్మ అరడుగుచుట్ట నోట్లోకి పోనిచ్చేసి, జేబులుతడుముకుంటూ, వంటిట్లోకి వచ్చాడు. వసంతకు చుట్టంటే చెడ్డ అసహ్యం. కాని కాల్చేది వర్మ. తప్పనిసరి అయిపోయింది నిప్పులపెట్టె సావిట్లోకి గిరాటు పెట్టింది. వర్మ అమాంతంగా నోట్లోంచి చుట్ట తీసేసి నేలకేసి కొట్టాడు. గబగబ రేడియో వాల్యూమ్ పెద్దదిచేసి రికార్డు సంగీతం వింటున్నాడు. మధుకూడా రేడియోదగ్గరకు వచ్చేసి కూర్చున్నాడు. సుజాతకు నవల చదవటం సాగటంలేదు. రెండుమూడుసార్లు విసుక్కుని రేడియో వైపు చూసింది. మళ్ళీ ఎందుచేతనో నవల కాస్త మూసేసి యిక్కడికే వచ్చి కూర్చుంది. వర్మ రెండుక్షణాలు ఎవరితోను మాట్లాడటం యిష్టంలేని వాడులాగ కనిపించాడు. సుజాత తండ్రివంక ఒకసారిచూసి మళ్ళీ తలవంచేసుకుంది.

"డబ్బంటే మహాచులకనగావుంది మీ అమ్మకు. అదృష్టం బాగుంటే, వాళ్ళేసంపాదించుకుంటారట. ఇంత వున్నది కాబట్టి దానికోరతేమీ కనిపించటంలేదు..." వర్మ రేడియో గభాలున ఆపేశాడు.

"ఏదో వకటి మనస్సును బాధిస్తూనే వుంటుంది ఎప్పుడూను" మధు విసుగ్గా అన్నాడు.

"అమ్మాయి పెళ్లెప్పుడు చేస్తారని మీరమ్మను అడుగుతుంటే అబ్బాయి పెళ్లెప్పుడు చేస్తారని నన్ను అడుగుతున్నారు..."

"వూళ్లో వాళ్ళందరికి మా పెళ్ళిళ్ళ సంగతే పట్టింది గాబోలు. అడిగే వాళ్ళకు చెప్పేరీతిగా సమాధానం చెపితే సరి మళ్ళీ నోరెత్తరు..."

"ఆ తెలివితేటలు మనదగ్గర లేవనే వాళ్ళు మళ్ళీమళ్ళీ అడగటం" సుజాత పూర్తిచేసింది.

"పిల్లల తెలివితేటలు తల్లుల కెలావస్తాయి. మేమేమన్నా పెద్ద చదువులు చదివామనా, మాకేమన్నా విషయాలు తెలుసునా" వసంత సమాధానం చెప్పింది.

"పోనీ నీకు చేతకాకపోతే పోయింది నా దగ్గరకు తీసుకురా ఆ అడిగేవాళ్ళెవరో నేను చెప్తాను."

"అడిగేవాళ్ళు సమాధానంకోసం అడగరు. అడుగుతారు అంతే"

"నేను వెళుతున్నా బజార్లో పనుంది" మధు లేచాడు.

"రెండునిముషాలు నీతో మాట్లాడాలి కూర్చో" వర్మ కూర్చోపెట్టాడు.

"ఏమిటి పెళ్ళి వ్యవహారం."

సుజాత పక్కున నవ్వింది మధు కూడా కొంతవరకు నవ్వు ఆపుకోలేకపోయాడు. ఒకళ్ళ మొహం ఒకళ్లు చూసుకుని సిగ్గు అభినయించారు

"ఒక బీదవాడికి అమ్మాయిని కట్టేసి, ఓ పది వేలు ఆ అబ్బాయికి పుచ్చుకుంటే మా అమ్మకు శాంతి" అసలు విషయం అది వర్మ సమ్మరైజు చేశాడు.

"మరి నీ వుద్దేశం."

"పెద్ద ఆస్తిపరుడు నీకు భర్తగా రావాలి. మరాఠీ చదువుకున్న పిల్ల నీకు భార్యగా రావాలి. మనకు ఆస్తి వుండనే వుంది. ఇంకా కట్నంతో పనేమిటి" వర్మ యిద్దరివంక సమాన దృష్టితో చూశాడు.

"నీకు నాకు వుంటే ఆస్తి, సుజాతకు వున్నట్టు కాదూ?" మధు ఆగకుండా అనేశాడు.

"ఆ..." వర్మకు యేదో క్రొత్త ఆలోచనగా కనిపించింది.

"ఇక మా అభిప్రాయాలు చెప్పమంటారా" మధు అడిగాడు.

"నిర్ణయాలే అనరాదూ" సుజాత సపోర్టు యిచ్చింది.

"సుజాత వేణుని పెళ్ళి చేసుకోబోతోంది" మధు ఆపేశాడు.

"అన్నయ్య శాంతను పెళ్ళి చేసుకోబోతున్నాడు" సుజాత పూర్తిచేసింది.

"ఆ... వేణుకా... దమ్మిడీ ఆస్తి లేనివాణ్ణి" వర్మ ఆశ్చర్యంగా చూశాడు.

"మన ఆస్తి రెండుచేస్తాం సగం సుజాత తీసుకుంటుంది" మధు పరిష్కారం చెప్పేశాడు.

"శాంత తండ్రి కట్నం యివ్వలేడు. అన్నయ్యకు కట్నం అక్కర్లేదు" సుజాత ఇంకో సమస్యవైపు మళ్ళింది.

"ఓ... వెరిగుడ్ ఐడియా. నా కింతవరకు తట్టనే తట్టలేదే..." వర్మ చివాలున కుర్చీలోంచి లేచాడు.

మధు, సుజాతలు కిలకిల నవ్వుకుంటూ యిద్దరు వెళ్ళిపోయారు

"విన్నావా..."

"ఏమిటి?"

"శ్రీమతి శాంత ఎం ఏ., కాబోయే కోడలు. శ్రీ వేణు బి. ఏ. బి. ఎల్. కాబోయే అల్లుడు."

"వాడు శాంతనే పెళ్ళిచేసుకుంటా నంటున్నాడు. ఒక్కమాట వేణువాళ్ళకు ఆస్తిలేదని హీనంగా చెయ్యకండి. అయిదారువేలు కట్నం యివ్వండి" వసంత ప్రాధేయపడుతూ అడిగింది.

"నీకింకా విషయాలు తెలీవన్నమాట..! అమ్మాయికి సగం ఆస్తి యిచ్చేస్తున్నా" వర్మ అతి సంతోషంగా అనేశాడు.

"ఆడదానికి ఆస్తి పంచుతున్నారా" హృదయంలోంచి ఎక్కడో తడబడుతూ ఆ మాటలు కాస్త వసంత పెదిమలమీద నాట్యమాడినాయి.

---

ఒక హత్య సమాచారాన్ని రిపోర్టుచేస్తూ, పత్రికా విలేకరి యిలా వ్రాశాడు: "హత్య చేయబడిన ఆసామీ అదృష్టవశాత్తూ ఆ క్రితంరోజునే తన డబ్బునంతా బ్యాంకులో వేసినందువల్ల, హత్యవల్ల అతను విలువైనదేదీ పోగొట్టుకోలేదు."

* * *

ప్రేమ గుడ్డిది కావచ్చు కాని, వివాహం అనే చికిత్స ఆ జబ్బును కుదిర్చేస్తుంది.